# అసంపూర్తిగా 'డబుల్' ఇళ్లు

- నిధుల లేమితో మధ్యలోనే ఆగిన నిర్మాణాలు
- వేగంగా పూర్తి చేసి పంపిణీ చేయాలని కోరుతున్న పేదలు


మధ్యలోనే ఆగిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు

గార్ల: గార్ల మండలం గుంపెళ్లగూడెం సమీపంలో 2017 సంవత్సరంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పనులు గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ పూర్తి కాలేదు. గత ప్రభుత్వంలో ముల్కనూరు, బుద్దారం పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి 20ఇళ్ల చొప్పున రూ.2.50కోట్ల వ్యయంతో 40డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, నాటి ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి నిధుల లేమితో కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగిస్తూ నేటికీ పూర్తి చేయలేదు. దీంతో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ఇళ్లలో గ్రామస్తులు రాత్రి సమయాల్లో మేకలు, గొర్రెలను తోలుకుంటున్నారు. ముల్కనూరు పంచాయతీ గుంపెళ్లగూడెం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లు 80శాతం మేర పూర్తికాగా, నేటికీ ఇళ్లకు తలుపులు, విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేయలేదు. ఇక బుద్దారం పంచాయతీలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో కేవలం బెస్మెంట్ నిర్మించి పిల్లర్లు వేసి వదిలేశారు. నాటి ప్రభుత్వంలో హౌజింగ్ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతగా పూర్తి చేసి అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి అందజేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై హౌజింగ్ ఏఈ జగదీష్‌ను 'సాక్షి' వివరణ కోరగా ముల్కనూరు, బుద్దారం పంచాయతీల్లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను జిల్లా అధికారులతో కలిసి ఇటీవల పరిశీలించాం. గతంలో ఇట్టి ఇళ్లను నిర్మించిన ఐటీడీఏ అధికారులు మాకు ఇళ్లను అప్పగిస్తే, ఇట్టి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి అర్హులైన పేదలకు ఇళ్లను అందజేస్తాం.

### పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలి



అసంపూర్తి నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సత్వరమే పూర్తిచేసి అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి అందజేయాలి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గుంపెళ్లగూడెం, బుద్దారం పంచాయతీల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు నేటికీ పూర్తి చేయలేదు.

\- కందునూరి శ్రీనివాసరావు, గార్ల

## క్లుప్తంగా

### ఎస్పీని కలిసిన హెడ్ కానిస్టేబుళ్లు



మహబూబాబాద్ రూరల్: వరంగల్ కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుళ్లుగా పనిచేసి పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

### 'హామీలు విస్మరించడం సరికాదు'

మహబూబాబాద్: ఎస్సీ వర్గీకరణ చట్టం పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాల నియామకాలను చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, విస్మరించడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య డిమాండ్ చేశాడు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి రెండో రోజు చేరాయి. దీక్షలను శనివారం గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోత్ కిషన్‌నాయక్ ప్రారంభించారు.

### మహిళా సంక్షేమానికి పెద్దపీట

మహబూబాబాద్ రూరల్: సీఎం నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ అన్నారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు.

### చర్య తీసుకోవాలి

నెల్లికుదురు సెంటర్: జిల్లాలో కాంట్రపల్లి మత్స్య పారిశ్రామిక సంఘంలో అక్రమంగా పోర్జరీ సంతకాలతో సభ్యత్వాలు పొందిన వారిపై, అందుకు సహకరించిన అధికారులపై కఠిన చర్య తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున అన్నారు. జిల్లా ఫిషరీస్ కార్యాలయంలో మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు.

### జిల్లా అధ్యక్షుడిగా సారయ్య



కేసముద్రం: ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కేసముద్రంవిలేజ్‌కి చెందిన పందుల సారయ్య ఎన్నికైనట్లు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోర్నెల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ఉచిత డ్రైవింగ్ శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: బీసీ యువతీయువకులకు టీజీఎస్ ఆర్టీసీ హకీంపేటలో ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.నర్సింహస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత డ్రైవింగ్ కోర్సులో హెవీ, తెలికపాటి వాహనాలకు శిక్షణ వ్యవధి 38 రోజులు ఇస్తారన్నారు. 18నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న అభ్యర్థులు కులం, ఆదాయం, నివాసం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 31వ తేదీలోపు జిల్లా కలెక్టరేట్ బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### సహకారం అభినందనీయం

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్న స్ఫూర్తి ఎడ్యుకేషనల్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సేవలు అభినందనీయమని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం క్లెం లక్ష్మారెడ్డి అన్నారు. తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (యూఎస్ఏ) సహకారంతో మండలంలోని అమనగల్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బెరైటీస్ ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్ సీజ్



గార్ల: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా బెరైటీస్ ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్‌కే రియాజ్‌పాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాత పోచారం గ్రామ సమీపంలో శనివారం పెట్రోలింగ్ చేస్తుండగా గార్ల మండలంలోని గుట్టల నుంచి బెరైటీస్ ఖనిజాన్ని వాసుదేవరెడ్డి ఆదేశాల మేరకు కోదాడకు చెందిన దారవునేని పూర్ణచందర్‌రావు, పసుపులేటి వెంకటేశ్వర్లు కలిసి సుమారు 28 టన్నుల ఖనిజాన్ని టిప్పర్‌లో లోడ్ చేసుకుని వెళ్తున్నారు. శనివారం పాత పోచారం గ్రామ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు లారీతో పట్టుబడ్డారు. లారీలోని బెరైటీస్ ఖనిజం విలువ రూ.1,64,000 ఉంటుందన్నారు. బెరైటీస్ ఖనిజం, టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు కృషి

- విద్యుత్ శాఖ డీఈ జి.మధుసూదన్


విద్యుత్ కిట్ పంపిణీ చేస్తున్న డీఈ

మరిపెడ రూరల్: వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు నిరంతరాయంగా కృషి చేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ జి.మధుసూదన్ అన్నారు. మరిపెడ మండలం ఎల్లంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చిన్నగూడూరు, ఎల్లంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందికి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా తెలంగాణ స్టేట్ సీఎండీ వరుణ్‌రెడ్డి అందజేసిన లైన్‌మెన్ టూల్‌కిట్‌ను సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ.. వేసవిలో వీచే గాలిదుమారాలకు విద్యుత్ అంతరాయం కలుగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్య వస్తే తక్షణమే పరిష్కరించేలా సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్‌ను ఉపయోగించి ఆకేరు, పాలేరు వాగుల్లో చేపలు పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాతో ఇటీవల పలువురు తమ విలువైన ప్రాణాలు కోల్పోయారని, ఇక నుంచి వాగుల్లో విద్యుత్ ద్వారా చేపలు పడుతున్న వారి వివరాలను తమ సిబ్బందికి గానీ, తమ కార్యాలయానికి గానీ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎల్లంపేట, చిన్నగూడూరు సబ్ స్టేషన్ ఏఈలు అజయ్, నవ్య, సబ్ ఇంజనీర్ రుబీనా, లైన్‌మన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకే ఏఐ బోధన


పెద్దవంగర: అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఏఐ(కృత్రిమ మేధా)ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రాథమిక పాఠశాలల్లో వెనుకబడిన 3,4,5 తరగతుల్లోని «సీ» గ్రేడ్ విద్యార్థులకు బేసిక్ మ్యాథ్స్, ఇంగ్లిష్, నేర్చుకోవడంతో వారిలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఏఐ బోధన ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిట్యాల క్లస్టర్ హెచ్‌ఎం ఎర్రోజు విజయ్ కుమార్, ఏఏపీసీ చైర్మన్ స్వాతి, ఉపాధ్యాయులు కవిరాజు, ప్రదీప్, అంబాభవాని, అనూష, సీఆర్పీలు సంతోష్, నిరంజన్, రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి**

తొర్రూరు రూరల్: ప్రాథమిక దశలోనే విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. శనివారం మండలంలోని అమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో ఎక్స్‌స్టెప్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మెన్ లక్ష్మి, కాంప్లెక్స్ స్కూల్స్ హెచ్‌ఎంలు శ్రీనుబాబు, తుమ్మ వెంకటేశ్వర్లు, యాకుబ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసముద్రం: కృత్రిమ మేధస్సు పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని ఇంటికన్నె ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. ఈమేరకు శనివారం పాఠశాలలో ఎంఈఓ యాదగిరి ప్రాజెక్టును ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎడ్ల సంపత్‌రెడ్డి, హెచ్‌ఎంలు శారదాబాయి, హోంజీ పాల్గొన్నారు.

### హామీలు నెరవేర్చాలి

బయ్యారం: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనను ఉద్దేశించి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భిక్షం, మురళి, వెంకన్న, రామకృష్ణ, ఐలయ్య, యుగంధర్, బుచ్చయ్య, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

### రైతుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. తెలంగాణ రైతు సంఘం మండల మహాసభ శనివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షులు ఎస్. నాగేశ్వరరావుతో కలిసి విశ్వేశ్వరరావు మాట్లాడారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అజ్మీరా వీరన్న, ప్రధాన కార్యదర్శిగా కోటగిరి యాకాంతం, కోశాధికారిగా కిరణ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి కిరణ్, గూడెల్లి ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికే టాలెంట్ టెస్టులు అని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో చేతుల మీదుగా టాలెంట్ టెస్ట్ ఫలితాలను విడుదల చేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. ఈనెల 1, 2 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు. ఈ పరీక్షలో 3,500 విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జి.జ్యోతి, జి.రాకేష్, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భద్రత అందరి బాధ్యత



తొర్రూరు: మాట్లాడుతున్న నాగవాణి

తొర్రూరు: బాలికల భద్రత అందరి బాధ్యత అని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. బాలికల భద్రతపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీటీం ఎస్సై ఆనంద్‌తో కలిసి నాగవాణి మాట్లాడారు. మహిళలు, బాలికలను ప్రతీ ఒక్కరు గౌరవించాలని, విపత్కర పరిస్థితుల్లో వారికి సమాజం అండగా నిలవాలన్నారు. బాలికలు ఆపద సమయాల్లో 100కు కాల్ చేయాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ శైలజ, సిబ్బంది శివకుమార్, ఫణి, శ్రీకాంత్, పార్వతి, రమేష్, జయశ్రీ, బేబి పాల్గొన్నారు.

**బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం**

మహబూబాబాద్ అర్బన్: బాల్యవివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని షీ టీం ఎస్సై హన్మకొండ ఆనందం అన్నారు. జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శనివారం షీటీం, చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కొత్త చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

## శాస్త్రీయ ప్రణాళికతో విజయం సాధించాలి


మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

కురవి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీఈఓ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శాస్త్రీయ ప్రణాళికతో పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. ఇష్టపడి చదువుకోవాలని తెలిపారు. ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం)లో ఉత్తీర్ణత సాధించేందుకు ఉపయోగపడే మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ బాధ్యులు, సామాజికవేత్త, చైల్డ్ వెల్ఫేర్ సభ్యుడు పరికిపండ్ల అశోక్, జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు, ఏఎంఓ చంద్రశేఖర్ ఆజాద్, హెచ్‌ఎం వాహిద్, ఉపాధ్యాయుడు శ్రీధర్, విజయ్‌రాజ్, వెంకన్న, యాకమ్మ పాల్గొన్నారు.

## ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెల్లికుదురు: నూతన ఇల్లు నిర్మించుకునే యజమానులకు ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేసి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కె.రాజుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుకు రవాణా చేయకుండా కందకాలు తవ్వించడం ద్వారా వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇసుక రవాణాపై నిషేధం ఎత్తివేసి ఇల్లు నిర్మించుకునే ప్రతి యజమానులకు ఇసుక రవాణాకు కూపన్లు అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బాబు గౌడ్, నర్సయ్య, యాకయ్య, పుల్లయ్య, మంగ్యా నాయక్, వెంకన్న, భిక్షపతి పాల్గొన్నారు.

## పంటలకు సాగు నీరందించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

తొర్రూరు రూరల్: బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటిపోయి ఎండిపోతున్న పంటలకు సాగు నీరు అందించాలని ఏఐకేఎంఎస్(రైతు సంఘం) జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మడిపెల్లి గ్రామ శివారులోని ఆకేరు బ్రిడ్జిపై రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆశోద యాకుబ్, పాశం యాకయ్య, నలమాల సంపత్, వెంకటనారాయణ, వెంకటయ్య, దేవరాజ్, సురేష్, వెంకన్న, సంపత్, ఏలేందర్, మల్లయ్య, సోమయ్య పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**పెండింగ్ వేతనాలను చెల్లించాలి**

తొర్రూరు: పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి కోరారు. డివిజన్ కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పొద్య భీకు, మండల అధ్యక్షులు గుండాల సోమనర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

**కాపర్ వైర్ చోరీ**

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లను పగలగొట్టి అందులోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన శనివారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన మెరుగు వెంకన్న, గంగధరి అంతయ్యకు చెందిన వ్యవసాయ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. గ్రామంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

**నేడు సంస్మరణ సభ**

నెహ్రూసెంటర్: సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా ఉద్యమాల్లో అల్లి శ్రీనివాస్‌రెడ్డి సంస్మరణ సభ నేడు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య తెలిపాడు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, రావుల రాజు, చీపిరి యాకయ్య పాల్గొన్నారు.

**పరీక్ష సామగ్రి పంపిణీ**

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లోని టెన్త్ విద్యార్థులు 42మందికి కురవికి చెందిన దివంగత బుక్కావీరమ్మ జ్ఞాపకార్థం రిటైర్డ్ ఉపాధ్యాయుడు బుక్కా పరమేశ్వరయ్య శనివారం పదో తరగతి పరీక్ష సామగ్రిని బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ వాహిద్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, వెంకన్న, విజయ్‌రాజ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

**ఎంపీకి సన్మానం**



గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు కృషి చేసిన ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను శనివారం గార్లలో అఖిలపక్షం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో నాయకులు దనియాకుల రామారావు, శ్రీనివాస్, జితేందర్ అగర్వాల్, కందునూరి శ్రీనివాసరావు, జంపాల వెంకన్న, మాన్యా, గిన్నారపు మురళీ పాల్గొన్నారు.

**12శాతం రిజర్వేషన్ ఇవ్వాలి**

కురవి: గిరిజనలకు 12శాతం రిజర్వేషన్ ఇవ్వాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ అన్నారు. శనివారం సీరోలు మండలం రేకుల తండా గ్రామంలో సీరోలు మండల అధ్యక్షుడు తేజావత్ జైల్‌సింగ్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 29న మానుకోటలో ఎల్‌హెచ్‌పీఎస్ సభ ఉంటుందని తెలిపారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తేజావత్ మల్సూర్ నాయక్, ప్రసాద్‌నాయక్, నెహ్రూనాయక్, సామా నాయక్, విజయ్ నాయక్ పాల్గొన్నారు.

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుండెపుడి గ్రామం దళిత కాలనీలోని స్వర్ణలక్ష్మీ అమ్మవారి ఆలయంలో రెండో రోజు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారికి సంప్రక్షణం, అభిషేకం పూజారులు జరిపించారు. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, ఉప్పిరెడ్డి, జగదీష్‌రెడ్డి, పులుసు రంజితచిరంజీవి పాల్గొన్నారు.

**పరీక్షప్యాడ్ల అందజేత**

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజ్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు డబ్ల్యూటీఎల్‌ఎం ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు పిల్లి కుమారస్వామి, పిల్లి సరిత, చేతి సంతోష్, ప్రశాంత్, హెచ్‌ఎం చీకటి వెంకట్రాంనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కూలీలకు గాయాలు**

దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడెం గ్రామంలో మార్బుల్ రాళ్లు దించుతుండగా రాళ్లు జారి ఇద్దరు కూలీలకు గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నూతనంగా గృహం నిర్మించాడు. గృహంలో మార్బుల్ రాళ్లు వేసేందుకు వాహనంలో తీసుకువచ్చాడు. మార్బుల్ దించుతుండగా ప్రమాదవశాత్తు కూలీలైన భూక్య కిషన్, గుగులోత్ రమేష్‌లపై పడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ తరలించారు.

**సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య మృతి**

మహబూబాబాద్: మహబూబాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సుంకు కృష్ణయ్య (57) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని మున్సిపాలిటీ కమిషనర్ నోముల రవీందర్ యాదవ్, టీపీఎస్ ప్రవీణ్ బాబు, అకౌంటెంట్ కుమార్, తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు రమేష్ సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు.

**బస్సు, కారు ఢీ.. తప్పిన ప్రమాదం**

కురవి: మండల కేంద్రం శివారు గ్యాస్ గోదాం వద్ద ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటన జరిగింది. మహబూబాబాద్ నుంచి ఖమ్మంకు మానుకోట ఆర్టీసీ డిపో బస్సు వెళ్తోంది. ఖమ్మం వైపు నుంచి కురవి వైపు కారు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా గ్యాస్ గోదాం వద్ద పరస్పరం ఢీకొన్నాయి. మహబూబాబాద్ రామన్నపేటకు చెందిన కారు డ్రైవర్ నిషాంత్, మరో వ్యక్తి కారులో ఉన్నారు. కారు ధ్వంసం అయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ప్రమాదం తప్పింది. సంఘటన స్థలానికి కురవి పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని కురవి పోలీసులు తెలిపారు.

## వస్తువు నాణ్యతపై జాగ్రత్త వహించాలి


గార్ల: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు

గార్ల: వినియోగదారులు సరుకులు కొనుగోలు చేసేటప్పుడు విధిగా బిల్లు తీసుకొని భద్రపరుచుకోవాలని గార్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు సమయంలో ధర, నాణ్యతపై చాలా జాగ్రత్త వహించాలని సూచించారు. వస్తువులు నాణ్యత లేకుంటే, బిల్లుతో జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేస్తే వస్తువు తయారు చేసిన కంపెనీ వినియోగదారుడికి నష్టపరిహారం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో అధ్యాపకులు నాగు, మోహన్‌రావు, చార్లీ, పున్నంచందర్, సుందరయ్య, రాజేష్, శ్రీనివాస్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: వినియోగదారులకు హక్కులు ఉంటాయని, వాటిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శాంతికుమార్ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## ఆస్పత్రిని పట్టణంలోనే ఏర్పాటు చేయాలి



తొర్రూరు: 100 పడకల ఆస్పత్రిని తొర్రూరు పట్టణంలోనే ఏర్పాటు చేయాలని అఖిల పక్ష నాయకులు తెలిపారు. వామపక్ష పార్టీలతో కూడిన తొర్రూరు ప్రాంత ప్రజా సమస్యల పరిష్కార పోరాట వేదిక ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వామపక్ష పార్టీల నాయకులు ముంజంపల్లి వీరన్న, ఎండీ యాకూబ్, బందు మహేందర్‌లు అధ్యక్షత వహించగా పలువురు నాయకులు మాట్లాడారు. వంద పడకల ఆసుపత్రిని మడిపల్లి గ్రామ శివారులో నిర్మించవద్దని, పట్టణంలోనే నిర్మించాలన్నారు. మెయిన్ రోడ్డు డ్రెయిన్ పనులు పూర్తి చేయాలని, ఎస్‌టీఓ, సబ్ రిజిస్ట్రార్, ఇరిగేషన్, ఫైర్ స్టేషన్, ఇతర శాఖల కార్యాలయాలు తొర్రూరులో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, పోరాట వేదిక కన్వీనర్ తమ్మెర విశ్వేశ్వరరావు, కోకన్వీనర్లు కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, మంగళపల్లి రామచంద్రయ్య, మంగళపల్లి శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యను గాలికొదిలేసిన ప్రభుత్వం

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో ఐటీఐ కళాశాలలో, ఇతర వృత్తి విద్యను ప్రభుత్వం గాలికొదిలేసిందని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కేలోతు సాయికుమార్, గుగులోతు సూర్యప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను శనివారం వారు సందర్శించారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

మరిపెడ: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకెళ్లాలని మరిపెడ టీఎస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అక్తర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్‌లో పేరెంట్స్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో మోడల్ స్కూల్ పేరెంట్స్ కమిటీ మాజీ అధ్యక్షుడు గండి విష్ణు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

**పిల్లలకు క్రమశిక్షణ అవసరం**

గూడూరు: పిల్లలకు చదువుతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు వారిపై శ్రద్ధ చూపాలని హెచ్‌ఎం పులి దేవేందర్ అన్నారు. మండలంలోని సీతానగరం ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ సమావేశం నిర్వహించారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646